
# తీరని అప్పు

## కాశీనాథ విశ్వం

"ఉండేది ఊడిపోతుంది. నామాట విను. పిల్లలు కలవాడివి. చెడిపోతావ్" అని వీర్రాజు రామయ్యను బెదరించాడు. రామయ్య వింటాడా! మరేం జరిగిందో.....



ఎండ విపరీతంగా కాస్తున్నది. బయట తల చూపేందుకు వీల్లేక వడగాడ్పులకు వేసారిన జనం ఇళ్లలోపల శైత్యోపచారాలు చేసుకుంటున్నారు. విసనకర్రల ఉపయోగం మరీ ఎక్కువ.

ఇలాంటి సమయంలో కూడా పొలం పనిలో తీరికలేక చెమటతో తడుస్తూ పనిచేస్తున్న రామయ్యనుచూస్తే ఇతవేం ప్రకృతికతీతుడా అనిపించకపోదు. జొన్నలు నాటడానికి తడుపుతున్నాడు. కాలువలో వస్తున్న నీరు పగుళ్ళు బారిన నేలలో ఇంకిపోతున్నాయి. పల్లెలో చల్లగా కాలం గడపాలనేదేకాదు రామయ్య ఉద్దేశ్యం నలుగురిలో సమవుజ్జీగా వుండాలని, నలుగుర్లో పచ్చగా వుండాలని. ఈ పట్టుదలతో నిట్టనిలువునా మాడ్చేస్తున్న ఎండలో దిట్టంగా నీరు త్రిప్పుతున్నాడు. కొందరప్పుడే జొన్న నారు వదిలేశారు. తనెప్పుడు వదిలేది? ఆలస్యానికి కారణాలు బోలెడు. రాగులు కోత కొయ్యడం, మడి రెండో భోగం చేయుటానికి సర్వ సన్నాహాలు. ఈ ఎండాకాలంలో మడికి దండిగా నీరు పెట్టలేడు. తెల్లవారి తోలివ మడి సాయంత్రం చూస్తే ఆరివుంటుంది. బావిలో నీరు చాలా లోతుకుపోతున్నది. ఇక పది రోజులిలానేవుంటే బావి త్రవ్వించాల్సివుంటుంది. పైపెచ్చు తను ఒంటరిగా పుట్టేడు. అప్పచెల్లెళ్ళ ఐదుగురికి పెళ్ళిళ్ళచేసి, చీర సారె ఇచ్చి పంపడానికి తలప్రాణంతోకకి వచ్చింది. పెళ్లిళ్లకు చేసిన అప్పు తీరనేలేదు. ఏం చెయ్యడం? ఇదే ఆలోచిస్తున్నాడు. ఈ సంవత్సరం ఆ సంవత్సరమంటూనే అప్పు కట్టడంలేదు. ఎద్దులు లేకపోడమో, బావి త్రవ్వడమో, బాన మోకు లేకపోవడమో ఏదో ఒకటికి ముడి పెట్టాల్సి వుంటుందాయె. అప్పుఎప్పుడు తీర్చి కులాసగా వుంటాడో తను. అప్పు నిప్పులాంటిదని అతనికి తెలియదా?

అప్పు తీసుకో కూడదు. అప్పుతో మునిగిన కుటుంబాలు ఎన్నో వున్నాయి అని అనుకున్నా ఆడపిల్లల్ని ఒకరికి అప్పగించే పూచి తనకు వదలి నాన్న తన చిన్న తనాన చనిపోయాడు. తన బ్రతుక్కు సుఖమన్నది లేనేలేదు. సంసార భారంతో క్రుంగిపోయినా ధైర్యాన్ని మాత్రం వదల్లేదు. అదే తనకి చుక్కాని అయింది.

అయిదుగురి అక్క చెల్లెళ్లను పంపించాడే కాని, అప్పు నాలుగువేల సంగతి? వడ్డి పెరుగుతున్నది.

"ఒరేయ్! ఎల్లిగా! కబిల వదలేయ్. సాయంత్రం వస్తాం ఈ బావికే. ప్రొద్దు చాలా ఎక్కింది" అరచాడు రామయ్య.

ఇది విని అరఫర్లాంగు దూరంలో కబిల తోలుతున్న ఎల్లిగాడు కబిల వదలేసి మోకు చుట్టుకుని బానతీసికొని వెళ్లిపోయాడు.

ఎడగాలవనీళ్ళ వచ్చే పర్యంతం రామయ్యవుండి పారను దోనెలోవుంచి ఎడ్లను పట్టుకుని ముందుకు నడిచాడు.

ఆకలిగావున్న ఎద్దులు, రామయ్య వుసూరుమంటూ ఇల్లు చేరుకున్నారు. ఎడ్లకు కుడితి తాపించి కట్టి ఎండు గడ్డివేసి తను అన్నానికి కూర్చున్నాడు.

అన్నంతిని దిన్నెమీద విశ్రాంతిగా కూర్చున్న రామయ్యవద్దకు కమసల రంగడు వచ్చాడు. ఎలక్షన్ కబుర్లలోపడిపోయారు.

"ఇది విన్నావా రామయ్యా?"

"ఏమిటి?"

"ఇంకా నీకు విషయమే తెలియలేదన్న మాట. పంచాయతీ ప్రెసిడెంట్‌గా వీర్రాజు నిలబడిపోతున్నాడు."

"నిలవనీ! ఇందులో వింతేంవుంది. ఎవరో ఒకరు ప్రెసిడెంటుగా వుండాలిగా మరి?"

"రామయ్యా! ఏదో కాస్తో కూస్తో చదువుకున్నావు. ప్రెసిడెంట్‌గా నిలువ్" అన్నాడు కంసల రంగడు.

"మహా మహా వాళ్లతో మనమో లెఖ్ఖా?"

"అదే వద్దంటా. అదికాదు రామయ్యా డబ్బుందేకాని తెలివికాని, చదువుకాని వాళ్లకేది చెప్పు. ఆహా! నువ్వు ఆఁ అను పనంతా మేం చూసుకుంటాం."

"రంగా! ఇదంతా నువ్వనుకున్నంత తేలిక కాదు. పోటీలు కొండతో ఢీ కొన్నట్లే తెలిసిందా!

మెంబర్‌గా కూడా వద్దని మొత్తుకున్నాను. ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు మీరేమో, చాలదా?"

"నీ తెలివి నీకు తెలియకపోయినా మాకు తెల్సు. ఒకసారి హనుమంతుడే తన ప్రతాపం తెలియకుండాపోయిన కథ నువ్వేగా మాకు చెప్పింది. అక్కడ ఇద్దరు నిలబడినా అందులో ఒకటి వాపసు తీసుకునేటట్టున్ను వీర్రాజు ఖచ్చితంగా నిలబడేటట్టు అంతర్యంగా తెల్సింది. నా మాట విని నిలబడు."

"నువ్వూరుకో రంగా."

"ఏం రామయ్యా! ఏదారంటే గోదారంటావ్. నీదోవ నీదేకాని నా మాట వినవంటావ్. హాస్యానికి చెప్పినట్టుందే? బిర్రబిగిసిపోతున్నావ్. ఆ లెఖ్ఖా పఖ్ఖా చూసే వాళ్లెవరంటా. బోడిడబ్బుంటే సరా? నలుగుర్ని కూడగట్టుకుని కట్టుగా చేయమను చూద్దాం. ఇంతకుమునుపు ఈ వీర్రాజు ప్రెసిడెంట్‌గా ఉన్నాడుకదా. ఏం పని చేశాడు. కాస్తంత చేశాడా? వున్న డబ్బుని అది చేశా, ఇది చేశానంటూ పై వుద్యోగస్తులకు లంచం ఎరగా చూపి తక్కినదంతా మింగేయలేదూ? చేసేంత పురసత్తు వుండాల, నిలవాల. అంతేకాని తగుదునమ్మా అంటూ రావటమే ముందుపూజ నాకని". ఉపన్యాసం దంచేస్తున్నాడు రంగడు.

"ఇంకేం చెయ్యాలంటావ్. ఆఫీసర్లు వాళ్లు వీళ్లు వస్తారు. వాళ్లకి పెట్టాలి. పేరు తెచ్చుకోవాలి. మనం ఇందులో జొరవడ్డం బేషరతుగా వుండదు. అదలావుంచు. అసలు గెలుస్తామా? గెలిచినా వాళ్ల పోటీతో నెగ్గుకురాగలమా? చమత్కారమేకాదు డబ్బుండాలి. డబ్బుంటే కొండమీది కోతి దిగివస్తుంది."

"చదువు వద్దంటావా?"

"సంతకం పెడితే చాలదూ? లేదంటే తక్కిన విషయాలకి గుమాస్తాని వుంచుకుంటాడు. ఇంతకీ మన కా గొడవ ఎందుకంట? కాలం అలా దొర్లిపోతున్నది ధనంతోనే. ధన మూల మిదం జగత్తు. వాటితోనే దర్జాలు, హోదాలు, పదవులున్నూ".

"అయితే నువ్వు నిలవ్వా?" అడగతలచినది నిగ్గదీసి అడిగేడు రంగడు.

"అన్నీ సవ్యంగా చెప్పా. ఇంకా నువ్వు అర్థం చేసుకోలేదు. పరిస్థితులు పూసగుచ్చినట్టుచెప్పాను. మన కెంతవుందో అంత చూపడం నయం. అంతేకాని నల్లిని నలిపినట్టు గుట్టుచప్పుడు కాకుండా నలిపేయగలరు. అవును రంగా అవును. నన్ను పంచాయతీ సభ్యుణ్ణిగా చేశారు. అంత చాలదా? వున్న దానితో తృప్తిపడండి."

"నువ్వు నిలబడి తీరాల్సిందే."

"నా కిష్టంలేదు"

"ఎలా వుండదో నేను చూస్తా. మేము విడుస్తున్నాం. మా శక్త్యనుసారం చూస్తాం. నువ్విలా సంతకం పడెయ్యి."

ఇంతలో అక్కడికి కొందరు వచ్చిచేరారు. వాళ్లంతా కూడా కంసల రంగనిపక్ష మవలంబించారు. రామయ్య ఒప్పుకోకపోయినా బలవంతాన సమ్మతింపచేశారు.

* * *

ఇదెట్లానో ప్రెసిడెంటుగా నిలబడపోవు వీర్రాజుకు తెలిసింది. 'ఎట్టెట్టా! పైసాలేదు. సరికదా అప్పుతో మునిగిపోతున్నాడు. వీడా తనతో పోటీ నిలబడ్తున్నాడు. చూస్తా. ఒక చెయ్యిచూసి మరి వదల్తాను. పైసా పైసా తేలుస్తా. పచ్చడి చేస్తా.' పళ్లుకొరికాడు వీర్రాజు.

తాజాగా తయారయ్యి నరసింహం కొట్టును సమీపించాడు.

"ఏమోయ్! నరసింహం!! ఏం చేస్తున్నావ్?"

"అయ్యా వీర్రాజుగారా! దయచెయ్యండి దయచెయ్యండి. మీరు వెయ్యికాలాలపాటు చల్లగా బ్రతకండి. మిమ్మల్నిగురించే అనుకుంటున్నాం. రండి" అంటూ వినయంగా కుర్చీ చూపించాడు నరసింహం. నరసింహానికి ప్రెసిడెంట్‌గా వీర్రాజు చేసిన మేలు గొప్పది. ఏమంటే పోరంబోకు చెట్లు వుచితంగా ఇచ్చాడు.

"కూర్చోడానికి కూడా తీరిక లేదోయ్ ఈ ఎల



క్షన్లో.".

"అవునవును. విన్నాను. మీరు నిలిచేటట్టున్నా విన్నాను. నిజమేనా?"

"అవును. ఇందులో నీ సహాయం అవసరమొచ్చింది."

"నేనా?"

"అవును. నువ్వే" అంటూ నరసింహం చెవి దగ్గరకువచ్చి "ఆ ముష్టి రామయ్యలేడూ? వాడు నాతో పోటీగా నిలబడ్తాడట." అన్నాడు.

"మీతోనా?" నోరు తెరచి అన్నాడు నరసింహం.

"రామయ్య బాకీ ఎంత వుంది?"

"నాలుగువేలు".

"ఆ పత్రం తీసికొనిరా. వెళ్ల తక్షణం తేయ్." నరసింహం రామయ్య రాసిచ్చిన నాలుగువేల అడమానపత్రం తీసిచ్చాడు.

"నాలుగువేలు వసూలుచేసే భారం నాదే సుమా? అది కూడా పక్షం రోజుల్లోనే?"

"ఆఁ".

"చూసుకో నా తడాఖా."

"నా కర్థం కావడంలేదే." బెం బే లు పడిపోయాడు నరసింహం.

"దమ్మిడిలేదు రాస్కెల్ చేతిలో. నాతో పోటీగా నిలబడుతున్నాడు. ఎంత పొగరు. ఎంత గర్వం."

"రామయ్య మీతో నిలబడుతున్నాడా? దేనికి"?

"నామినేషను దాఖలు చేసేశాడు. పది రోజులున్నది ప్రెసిడెంట్ ఎలక్షన్ మెంబర్లని చూస్తున్నాను. ఇక వెళ్లొస్తా. నీ డబ్బు చేతిలో వున్నట్లనుకో." పత్రాన్ని పుచ్చుకుని వెళ్లిపోయాడు ఆశావాదిగా వీర్రాజు.

వెళ్లినవాడు వివాదానికి దిగేడు. పనిచేసే కుర్రవాణ్ని పిలిచి రామయ్యని రమ్మని కబురంపేడు ఇప్పుడే రావాలని.

వీర్రాజుపిట్ట నిట్టనిలువునా తన గూట్లో వాలిపోవాలని ప్లాను వేస్తున్నాడు. ఒకసారి మంచిగా చెప్పి చూస్తాను. వచ్చి నా త్రోవకు వచ్చాడా సరి. లేదా పెచ్చు రేగాడా కోర్టు చూసుకుంటుంది. మించిందిలేదు. నవ్వుకున్నాడు తనలో తనే.

పచారు చేస్తున్న వీర్రాజును రామయ్య వచ్చి పలకరించాడు.

"జరూరుగా రమ్మన్నారట. ఎందుకో?"

"రామయ్యా! రా. అలా కూర్చో. పిలిచాను."

"ఎందుకని అడుగుతున్నా."

"నాతో పోటీగా నిలబడుతున్నావట నిజమేనా."

"నిజం."

"త్రాచు పాముతో చెలగాటమాడుతున్నావని మరచావా?"

"మరచిపోలేదు."

"అయితే దూరంగా వుండు."

"నువ్వూ దూరంగా వుండు."

"రామయ్యా." కేకేశాడు వీర్రాజు.

"ఏమయ్యా." వ్యంగ్యంగా అన్నాడు రామయ్య.

"ప్రెసిడెంటుగా ఇన్ని సంవత్సరాలుగా వుంటున్నా...."

"ఒక మంచి పని చేశావా?"

"నిలిచిపో. నా మాట విని."

"మొదట్లో నేనూ అలానే అనుకున్నాను వాళ్లంతా ఏకంగా నన్ను నిలబడమంటే నిలవక తప్పింది కాదాయె. ఇక నామినేషను వాపసు తీసుకోవటం జరుగదు."

"అదే కూడదంటున్నా."

"నీకుండే స్వంతం నాకూ వుంది."

"ఉంది. ఉంది. లేకేం నక్కకు నాగలోకాని కుండేంత స్వంతం వుంది."

"సామెతలు చెప్పడం తెల్సు."

"రామయ్యా! అంతరం తెల్సుకుని మాటాడు"

"లేకపోతే."

"లేకపోతే డొక్కచీల్చి డోలు కట్టేస్తా."

"చేసుకో నీ ఇష్టం వస్తే."

"ఆగు...."

"ఏం? ఎందుకని?"

"నాలుగు వేలిస్తా అప్పుగా. నరసింహం బాకీ తీర్చు. మళ్లా నీ ఇష్టం వచ్చినప్పుడిద్దువు. ఇదిగో."

"నామినేషను వాపసు తీసుకోవటం కలలోని వార్త. బాకీ మాటంటావా? ఆస్తిలో సగం పోతుందేమో. అంతేకాదా."

"ఉండేది వూడిపోతుంది. నా మాట విను. పిల్లలు కలవాడివి. చెడిపోతావ్. పచ్చగా రైతులతో బాటు బ్రతుకు."

"వినను."

"వినవా?"

"వినను. వినను."

జేబులోని పత్రంతీసి చూపాడు వీర్రాజు. "చూశావా? నాతడాఖా. ఇపుడే చిత్తూరు పోతున్నా వకీలుతో సంప్రతించటానికి. చెయ్యవలసిన పని చేస్తా."

"చేసుకో బెదిరిస్తావేమెు. నన్ను కాదు బెదిరించేది. రేపు ఎలక్షన్లో నీ ప్రతాపం చూపించు."

"చూపిస్తా. చూసుకో,"

"కార్యరూపంలో కావించు నీ పస" అంటూ రామయ్య అక్కడనుండి వెళ్లిపోయాడు జోరుగా.

దాని ఫలితంగా వీర్రాజుకు ఖర్చు కొద్దిగా అయింది. 'సమను' రావటంతో కోర్టుకి వెళ్లాడు చిత్తూరికి. చిత్తూరులో నరసింహం కన్పిస్తే కొంచెం ప్రోత్సాహపడ్డాడు. కొద్ది రోజుల గడువు అడిగాడు. వీర్రాజు పురి ఎక్కించివుంటే ఇక ఎక్కడ వినటం?

కోర్టులో రామయ్య తీసికొన్నరూపాయలు వాస్తవమని పది హేను రోజులు గడువిమ్మని అడిగి తీసికొన్నాడు.

సాయంత్రమే బస్సులో బయల్దేరాడు. మరుసటి రోజే ఎలక్షన్.

అప్పటికే ప్రొద్దుపోతున్నది. బస్సుదిగిన రామయ్య వూరుచేరుకోటానికి రెండు మైళ్ళు నడవాలి.

పడమటి కొండల్లోనుండి అరుణ కిరణాలు ఏటవాలుగా భూకాంతను చుంబిస్తున్నాయి, అందంగా బంగారు కాంతితో. పక్షులు పస్తులు లేకుండా మేసి గూళ్లకు చేరుకుంటున్నాయి. కిలకిలలు ప్రతిధ్వనిస్తున్నాయి. మధుర సంధ్య ఎరుపుదనంతో వున్నది. ఎక్కడో కోయిలొకటి కుహూ కుహూ మని ర సా ల సా ల నవపల్లవాన్ని మెక్కి రమ్యంగా కూస్తున్నది. తూర్పునుండి తెల్లగా వెళ్లిన మేఘపుంజాలు పడమటదెసజేరి ఎర్రగామారిపోతున్నాయి.

రామయ్య ఆలోచనలు అతని నడకకంటె తీవ్రతరమవుతున్నాయి. డబ్బెక్కడనుండి తెచ్చి కట్టగలడు? ఒక్క రూపాయా? నాలుగు వేలతో బాటు వడ్డీ రూపాయలు కట్టడమంటే నోటి మాటలా? భూమి అమ్మివేసి కట్టడమంటే తనే బలవంతంగా అమ్మచూపడం మూలాన తక్కువ ధరతో ముట్ట చెప్తారు. అసలు వీర్రాజే అందర్ని వశపరచుకొనగలడు. ఏమయినా నరసింహం బాకి ఎలక్షన్ తర్వాత కట్టివేయాల్సిందే. అ ప్పు లే ని బ్రతుకు గం జి త్రా గి బ్రతికినా మేలు. అప్పు చేసి పప్పుకూడు తను తిన లేడు. తిన్నా తను అరగించుకొనజాలడు. బాకీతీర్చి హాయిగా వుండటం శ్రేష్ఠం.

చీకటి భూమిని పూర్తిగా మ్రింగివేసి పెను రక్కసిగావుంది. బండి బాట వెంబడి చెట్లు దట్టంగా వ్యాపించివున్నాయి. ఇక మైలున్నది. చిన్న గుట్ట ఎక్కి దిగితే అదే వూరు. గుట్టనుండి క్రిందికి చూస్తే గ్రామంలోని దీపపు మినుకులు కన్పిస్తుంది. గుట్టపైన ముళ్ల దిబ్బలు అధికం.

పోతున్న రామయ్యకు పది గజాల్లో సవ్వడి విన్పించింది. బ్యాటరీ లైట్ వెలిగింది. ఎవరో వస్తున్నారు కొందరు. చేతుల్లో ఏదో వున్నట్టుంది. నడుస్తున్నాడు. మనుష్యులు సమీపించారు.

ఇంతలో రెండు కర్రలు తన తలపై వడిగా పడిపోయినవి. ఒక గావుకేకపెట్టి పడిపోయాడు రామయ్య.

* * *

ఆసుపత్రి బెడ్పైన రామయ్య కప్పుడే స్పృహ వచ్చింది. కలగనలేదుకదా తను. ఎక్కడ వున్నాడు? నర్సు ఎవరు? తలపై ఈ కట్టేమిటి బాధగా వున్నదే రామయ్య తనలో తనే గొణుకున్నాడు.

నర్స్వచ్చి టెంపరేచర్చూసి వికసించిన ముఖంతో కదలకూడదని సంజ్ఞచేసి వెళ్లిపోయింది మరో బెడ్ తనిఖీకి.

రామయ్యకు బాధగా వున్నది. జరిగింది నెమరేసుకున్నాడు. కర్రలు మాత్రం కన్పించాయి. ఫలాని వ్యక్తులని తెలియలేదు.

కంసల రంగడు ఎలక్షన్ గొడవలో వుండిపోయాడు. ఇరుపక్షాల ప్రచారం ముమ్మరంగా వుంటున్నది. వీర్రాజు పంచాయతీ సభ్యులను కారులో వుంచుకుని వేలూరు, కంచి, తిరువణ్ణా

ఉపాధ్యాయుడు- రామూ, 'చదివినవానికన్న చాకలి మేలు' అంటారే. దాని అర్థమేమిరా?

రాము-అంటే చదివినవానికన్నా చాకలి మంచి దుస్తులు ధరిస్తాడని సార్.

జి. రామసుబ్బారెడ్డి (మద్దూరు)

మళ్ళై, చిత్తూరు తిప్పిస్తున్నాడు. వారికి కావలసిన పప్లై ఏ లోపం లేకుండా జరిపిస్తున్నాడు. అన్ని రకాల విందులు పెట్టించాడు. వీరరాజు ఇలాంటి ఖర్చు ఎంతయినాసరే వెనుకంజ వేయడు.

పోటీ అభ్యర్థుల్లో ఒకరికి గాయాలు తగిలిన కారణాన అసాధారణ పరిస్థితిని ప్రకటించి మధ్యాహ్నానికి రహస్య బ్యాలట్ పద్ధతిలో ఎలక్షన్ జరిగింది. కంసల రంగడు తిరుగుతున్నాడు. న్యాయం గెలుస్తుందన్న నమ్మకం అతనిది.

ఎన్నిక సమయానికి గ్రామప్రజలు హడావిడిగా పోలింగ్ జరిగే స్థలంలో మూగిపోయారు. వారిని సర్దలేక పోలీసులు నానా యాతన పడుతున్నారు. పోలింగ్ కొట్లాటలు, తిట్టుకోవడాలు లేక ప్రశాంతంగా ముగిసింది. బయట వేచివున్న జనం ఫలితాలుకోసం అర్రులు చాచుకుని ఉత్సాహ భరితులౌతున్నారు.

రామయ్య రెండు వోట్ల మెజారిటీతో గెలిచాడు. వీరరాజుకు ఆశ చూపిన మెంబర్లు అతనికి ఎగనామం వేశారు. అంతే!!

ఆస్పత్రిలో రామయ్య పరిస్థితులు సుమారు. కొద్దిగా కోలుకున్నాడు. కంసల రంగడు, రామయ భార్య, పిల్లలతోవచ్చి రామయ్యను చూశారు. జరిగినందుకు నొచ్చుకున్నాడు రంగడు. పాతిక రూపాయ లిచ్చాడు. రామయ్య తనకేం ఫర్వాలేదని రెండు మూడు రోజుల్లో రాగలనని భార్యా పిల్లల్ని కంసల రంగనితోపాటు పంపించేడు ధైర్యం చెప్పి. లేచి కూర్చుని బాధ లేదని చెప్పిపంపాడు. తనుగురించి బెంగ అనవసరమని నొక్కి చెప్పాడు. కంసలరంగడు ఎన్నిక వార్త చెప్పినా అంత సంతోషం కన్పరచలేదు రామయ్య.

దెబ్బలు రాత్రి తగిలినయ్. సరే. తన్నెవరిక్కడ చేర్పించింది? అంతటి వేళ ఎవరొచ్చారు? అదే అర్థం కాకుండా వున్నది.

నర్సును దగ్గరకు పిలిచి తానేవిధంగా వచ్చింది అడిగాడు.

"రక్తం కారుతున్న మిమ్మల్ని నరసింహం ఇక్కడకు చేర్పించాడు. తన పేరు మీకు చెప్పొద్దన్నాడు."

రామయ్యకు దిగ్భ్రమ కల్గింది. నరసింహం తనకి వ్యతిరేకి. పత్రం బాకీకోసం కోర్టులో వున్నాడు నరసింహం తనని ఆస్పత్రిలో చేర్పించాడా? తన ప్రాణాన్ని కాపాడేడు నరసింహం!! ఆశ్చర్యం, ఆనందం రెండు పెనగొన్నాయి. రామయ్యకి.

భార్య పిల్లలు వెళ్లిన రోజు ఆహారం బాగా పుచ్చుకున్నాడు.

మరునాటి తెల్లవారి రామయ్య లేవటంతో పుష్టిగా ఉన్నది. నడవాలనే కాంక్ష వచ్చింది. లేచి తిరిగాడు. పైపై దెబ్బలు కావటం మూలాన పరిస్థితి మెరుగ్గా వున్నది. డాక్టర్లు, నర్సులు రామయ్య ఆరోగ్యానికి సంతసించారు.

నరసింహం లోపలికొచ్చాడు.

"నరసింహం రా కూర్చో" అంటూ జరిగి మంచంపై చోటిచ్చాడు. నరసింహం పడుకోమని బలవంతం చేశాడు.

"నాకేం బాగున్నా నరసింహం".

చీనీపండు ఒలిచి యిచ్చాడు రామయ్యకు. తింటున్న రామయ్య "నన్నెలా ఆస్పత్రిలో చేర్పించావ్?" అని అడిగాడు.

"తెలిసిందా?"

తెలిసిపోయినదని తలాడించాడు.

"ఆనాడు కోర్టులోనుండి నువ్వు వచ్చేశావా? నాకు బజారులో కొంచెం పనివుండటం మూలాన ఆ పని చూసుకొని వచ్చేంతలో బస్సు వెళ్లిపోయింది. టాక్సీ ఒకటి అవసరానికి దొరికింది. అదే పదివేలనుకుని ఎక్కాను. మన రోడ్డునుండి రాత్రి వస్తుంటే దారిలో నువ్వు పడివున్నావ్. చీకటిలో ఎవరైనది తెలియలేదు. వీపుపైన వేసుకుని రక్తపు మరకల్తో చేరాను. రోడ్డు. బస్సులోకి ఎక్కాకనే నీ ముఖం తెల్సింది...."

"సరిసరి. నా కర్థమయింది. నీ మేలు నే నెన్నటికిని మరచిపోలేను."

"ఎలక్షన్లో గెలిచావు. తెల్సా" అని ఆ విషయాన్ని మార్చేశాడు నరసింహం.

గెల్వటంలో చురుగ్గా మాటాడలేదు రామయ్య. గెలుపు, ఓటములకు మురిసిపోవటం, విచారించటం తన తరహాకాదు. రెండూ జీవితంలో కలగా పులగంగా ఒకదానివెంట వచ్చే సంఘటనలు.

"అన్నట్టు ఓ విషయం చెప్పాలనే వచ్చాను రామయ్యా. ఎప్పుడూ లోపల విషం పైకి తేనెల మాటాడే వాళ్లని నమ్మనేకూడదు. నువ్వేమంటావ్?"

"ఎవర్నిగురించి నీవీ మాట లంటున్నది?"

"ఇంకెవరు? ఆ వీరరాజే!"

"వీరరాజా? మీ రిద్దరూ చాలా స్నేహంగా వుండేవాళ్లే."

"వీరరాజు పేరు చూడు మహ లావు. ఏంచేశాడనుకున్నావ్. పత్రం నా దగ్గరనుండి తీసికొన్నాడా? ఎలక్షన్లో ఓడిపోయాడు. నాలుగువేల్లో రెండు వేలు అవసరంగా కావాలన్నాడు. నా డబ్బు నీ కిచ్చేది లేదు పోపొమ్మన్నాను. పత్రం ఇవ్వనన్నాడు. నేనెవర్ని నరసింహాన్ని. వాడి ఎత్తులకి పై ఎత్తులువేసి పత్రాన్ని దొంగలించేశాను. నా పత్రం ఇవ్వను అనడానికి వాడెవడంట? నా పత్రం నాది. అంతే గాని వీడెవడు. ద్రోహి. ఇవ్వనన్నాడు. మోసాన్ని మోసంచేతనే జయించాను. రాత్రి జరిగింది విను. నా కొట్టును కొల్లకొట్టడానికి ప్రయత్నించాడు. ఈ గుట్టు నాకు చేరింది. కొట్టు లేకుండా సామాన్లు మార్పించేశాను. ఇంకా ఎన్నో పనులు చేయాలనుకుంటున్నాడు.మనమంతా ఒకటిగావుండి ఆ చీడ పురుగును బైటికి రాకుండా చెయ్యాలి. ఐక్యంగావుండి ఆ వేరు పురుగు అహంకారాన్ని అణచాలి. స్నేహంగా వుండి ఇంత చేస్తాడనుకోలేదు. ఇంతకీ కారణం ఎలక్షన్లో ఓడి పోవటమే. రామయ్యా నిజం చెబుతున్నా. నువ్వెపుడు డబ్బు కడ్తావో అప్పుడే కట్టు. పత్రం నీదగ్గ రేవుంచుకో.నీపైననాకానమ్మకంవుంది."

"లేదు నరసింహం. నీ బాకీని చెల్లించాలి. నా భూమి అమ్మి వేస్తాను."

"అరెరే! నేల అమ్మటమా? ఎంత అమాయకుడవయ్యా. నేను చెప్పటమేమి? నువ్వు చెప్పటమేమి? ఈ పత్రాన్ని రద్దు చేసి కొత్త పత్రం రాయించెయ్. ఇంకా సంవత్సరాలు పొడిగి వస్తుంది. నువ్వెపుడు కట్టినా ఒకటి మాత్రం జ్ఞాపకం వుంచుకో. సరేనా?" పత్రాన్ని అందించాడు నరసింహం.

పులకరించిన హృదయంతో పత్రాన్ని అందుకున్నాడు రామయ్య. ★


శ్రీబాలాంజనేయప్రశ్న

మీరు కోరిన 5 ప్రశ్నలకు వెంటనే వ్రాసి పంపగలము. 2 రూ॥ M. O. చేయండి. నెలలువారీగా 12 నెలలకు 1 సంవత్సరం జాతకము 2 రూ॥ పూర్తి పేరు, జాబు వ్రాసిన టైము తెలిపిన చాలును. హనుమాన్ జ్యోతిషాలయము, 10వలైను, అరండల్ పేట,గుంటూరు-2.

అబలసుధ

స్త్రీలసమస్తవ్యాధులకుగ్యారంటు। ప్రదరము, ఋతుశూల, అకాల బహిష్టు, అత్యుష్ణము, గుండె దడ, నడుము నొప్పులు మొ॥ హరించి బలము నిచ్చును.
ధర రు 3

ఇండియన్ మెడిసన్ హౌస్
విజయవాడ - 2

యాలక్కాయ, లవంగము
తాంబూలములకు
యిప్పుడు అక్కరలేదు.

రుచి




సుగంధ ద్రవ్య సముదాయము
అన్ని కిరాణాకొట్లలో దొరకును.
కిళ్ళీకొట్లలో వాడబడుచున్నది.
నానాకాస్మటిక్సు, విజయవాడ-2.

VARIETY'S

Tel: SOUND Phone No· 120·
స్త్రీలపాలిటి కామధేనువు
"డిస్మెక్యూర్"
(రిజిష్టర్డు)
(ఋతుశూలహరి)
వేలకొలది స్త్రీలు "డిస్మెక్యూర్" వాడి గంటునొప్పి బాధనుండి నివారింపబడిరి. గంటునొప్పి బాధను గ్యారంటీగా పోగొట్టును. వెల రు. 4-0-0
డాక్టర్ సి.మల్లిక్స్ ఫార్మసీ
విశాఖపట్నం
డిస్ట్రిబ్యూటర్సు:
వైజాగ్ రేడియో కో., విశాఖపట్నం-1